

# అనగనగా ఓ మంచి కథ

# తమ్ముడు

## సానిపిని జోగిరాజు చౌదరి

## (భారతి 1944 మే సంచిక నుంచి)

వెంకటయ్య గారి శ్రాద్ధం పెట్టిన మర్నాడే చిన్నారావూ, అతని మామ రాఘవయ్యా కలిసి రాజేశ్వరుని గదిలో ప్రవేశించి, పంపకాల గొడవ తేల్చుకుంటే బావుంటుందని చూచాయగా సూచించేరు. తండ్రి శ్రాద్ధం వెళ్ళి పూర్తిగా ఒక రోజు కూడా దాటకుండానే పంపకాలను గురించి తన తమ్ముడు అంత శ్రద్ధ వహిస్తాడని కాని, రాఘవయ్య గారి దూరదృష్టిని గురించి కాని ఆలోచించగల మనశ్శాంతి లేని రాజేశ్వరునకేమి బోధపడింది కాదు.

"నే చెప్పేది తెలీలా ! ఆయన అదృష్టవంతుడు. త్వరగా ఆయన దారాయన చూసుకున్నాడు. యిక మీరు కూడా పెద్దవాళ్ళయ్యారు. ఊ! ... తెలీలా! ఆయన కూడా అంతా తేటపరిచే పోయాడు, ధర్మరాజు ! నేనిక్కడ ఉండగానే మీరు ఎవరిది వారు సరిచూసుకున్నట్టయితే, నేను మళ్ళా శ్రమపడి ఇక్కడికి రాకుండాపోతుంది" అంటూ తన ధోరణి సాగించేడు రాఘవయ్య.

అంతవరకూ మౌనంగా వింటూన్న రాజేశ్వరుడు ఒక్కసారిగా ఉలిక్కిపడి "ఏమిటీ, మీరనేదీ ?" అన్నాడు.

"నేననేది తెలీలా ? ఆయన పిత్రార్జితమైతేనేమి, స్వార్జితమైతేనేమి కావలసినంత దిగవిడిచిపోయారు; మీ మారుతల్లికి అల్లుడు రాకముందే, మీరు ఎవరిది వారు తేల్చుకోకపోతే చేతులు కాలేక ఆకుల కోసం వెదికినట్టౌతుంది" అని తన పరిణామజ్ఞానాన్ని వెళ్ళబోసేడు రాఘవయ్య.

"ఆమె మారుతల్లో, అసలు తల్లో నీకెలా తెలుస్తుందిలే" అనుకున్నాడు రాజేశ్వరుడు; పైకి "మీరనేది మమ్మల్ని పంచుకోమనేగదూ?" అన్నాడు.

"నేననడమేమిటీ ? మీ తమ్ముని ఉద్దేశం కూడా అదే" అన్నాడు రాఘవయ్య.

రాజేశ్వరుడు కుపితుడై 'నిజమా' అన్నట్టుగా తమ్ముని ముఖం వైపు చూడగా, అతను చటుక్కున తల వాలవేశాడు.

"నీవు పిన్నిని శంకించేటంత తెలివైనవాడివయ్యావని యింతవరకూ నాకు తెలీదు. దీనికోసం పంపకాలెందుకూ ? యివిగో తాళం చెవులు, నీ దగ్గరే పెట్టుకుని పెత్తనమంతా నీవే దిద్దు" అంటూనే తాళాల గుత్తి తమ్ముని మీదికి విసిరేడు రాజేశ్వరుడు.

యీ సంఘటనకు రాఘవయ్య చాలా విస్మితుడయ్యాడు. తన అల్లునికి తను ఎంత తేలిగ్గా పెత్తనం యిప్పించగలిగిందీ యింటికెళ్ళి భార్యతో ఎంత రసవత్తరంగా వర్ణించి చెప్పాలో, అప్పుడే అంచనా వేసేసుకొన్నాడు. తనను రైలు దాకా సాగనంపటానికి వచ్చిన అల్లునికి మాత్రం త్వరగా కొన్ని గ్రామాలు కొనేటందుకు కొన్ని ఆర్థిక సంబంధమైన హితోపదేశాలు చేసి మరీ రైలెక్కేడు.

★★★ ★★★ ★★★ ★★★

వెంకటయ్య గారి ప్రథమ భార్య జానకమ్మకు లేకలేక రాజేశ్వరుడు జన్మించాడు. ఆ తరువాత రెండేళ్ళకు చిన్నారావు కలిగాడు. లేకలేక కలిగిన రాజేశ్వరుడంటే జానకమ్మకు ప్రాణ సమానం. ఆవిడ మూడో కాన్పుకు ఆడపిల్లను ప్రసవించి పురుడైనా వెళ్ళకుండానే యీలోకం విడిచిపోయింది. ఆవిడ

పోయిన పదిరోజులకు ఆ ఆడశిశువు కూడా తల్లిని వెతుక్కుంటూ పోయింది. బంధువుల బలవంతం మీద వెంకటయ్య గారు మళ్ళా పార్వతమ్మను సశాస్త్రీయంగా పరిగ్రహించేరు. పార్వతమ్మ భర్త యింటికి వచ్చిన కొద్దిరోజుల వరకూ పిల్లల్ని లాలించటానికి సిగ్గు పడినా, ఆ తరువాత అధికమైన చనువుజేసుకుని అనేక విధాల ఆదరిస్తూ, స్వంత తల్లికంటే ఎక్కువగా ప్రేమించేది. పెద్ద పిల్లవాడు పరోక్షంలో మాత్రం 'మా పిన్ని' అంటాడు కాని తనను 'పిన్ని' అని పిలవడానికి సిగ్గు పడుతున్నాడని గ్రహించింది. దీనికి కారణం వాడి మాతృస్మృతి యింకా మాయక పోవటమేనని కూడా గ్రహించింది.

ఆమె ఒక్కొక్కప్పుడు భర్తతో "మన పెద్దబ్బాయిని గురించి మీ ఉద్దేశమేమిటి?" అనేది. అందుకాయన నవ్వుతూ "ఏమిటో, వాడు యీ లోకానికి సంబంధించినవాడు కాదు" అనేవాడు.

"వాడు నిజంగా నాకు పెద్ద కొడుకే" అనేది పార్వతమ్మ కౌతుక స్వరంతో...

పార్వతమ్మ కాపరానికి వచ్చిన రెండేళ్ళకు ఒక ఆడపిల్ల పుట్టింది. తరువాత మళ్ళా సంతానం కలగలేదు. శేషంటే రాజేశ్వరునకు అమితమైన ప్రేమ. రాజేశ్వరుడంటే శేషుకు అమితమైన భక్తి. చిన్నారావంటే శేషుకు ఓ విధమైన భయం. దీనికి కారణం : అతను తరచూ మేనమామ యింటి దగ్గర ఉంటున్నందువల్ల అతని దగ్గర శేషుకు కావలసినంత చనువేర్పడలేదు. ఆమెకు పదో ఏడు జరుగుతూండగానే వెంకటయ్య క్షయ జబ్బు వల్ల మరణించేడు. ఎటునుంచెటొస్తుందోనని, దూరదృష్టి గల వెంకటయ్య తన మరణంముందు తన భార్య పార్వతమ్మకు పదిహేనెకరాల మాగాణీ, శేషుకు పసుపుకుంకుమ నిమిత్తం యిరవై ఎకరాల మాగాణీ, పదివేల రూపాయిల రొఖ్ఖమూ విల్లులో వ్రాసిపెట్టేడు...

★★★ ★★★ ★★★ ★★★

యిప్పుడు అన్నదమ్ములిద్దరూ, సవతి తల్లీ కలిసే ఉంటున్నారు. పెత్తనం మాత్రం చిన్నారావు చలాయిస్తున్నాడు. పోయిన కార్తీక మాసంలోనే చిన్నారావుకు ఒక మొగసంతానం కలిగింది. రాజేశ్వరునికి మాత్రం సంతు లేదు. దానిని గురించి అతనెప్పుడూ విచార పడనూ లేదు. తనకు తమ్ముడైనా, కొడుకైనా చిన్నారావే. తనకు చెల్లెలైనా, కూతురైనా శేషే. యీ ఉద్దేశ్యంతోనే తాళాలు తమ్మునికిచ్చేసి నిశ్చింతగా చేతులు కడుక్కున్నాడు.

రాజేశ్వరుని భార్య సత్యవతి ఒకనాటి రాత్రి భర్త పాదాల దగ్గర కూర్చుని యిలా అన్నది : "యీ యింట్లో రోజు రోజు యీ అవమానం నేను సహించలేను."

"..................."

కళ్ళు తుడుచుకుంటూ మళ్ళీ అన్నది: "మీకైతే తమ్ముడంటే మహా ప్రేమ; అతనికి మాత్రం మీరంటే..." దుఃఖాన్నాపుకొంటూ, "వరలక్ష్మికి నేనంటే అసలే కిట్టడం లేదు." సత్యవతికి దుఃఖం పొర్లుకొచ్చింది.

ఇంతవరకూ కళ్ళు మూసుకునే వింటూన్న రాజేశ్వరుడు మెల్లగా కళ్ళు విప్పి "ఏమిటీ, అసలు సంగతి? ఏడవడమెందుకూ?" అన్నాడు.

"నిన్న మన దాసీ సుబ్బి, నా దగ్గర ఏడుస్తూ దాని భర్త రోగంతో యింటిదగ్గరే ఉంటున్నందువల్ల యిబ్బందిగా ఉందని రెండు కుంచాల బియ్యం ఇప్పించమంది. నామనసు కరిగి, సత్తెయ్యను పిలిచి, దానికి నాలుగు కుంచాల బియ్యం ఇవ్వమన్నాను. అందుకు వరలక్ష్మి 'యిక్కడ ఎవళ్ళ పుట్టింటివాళ్ళు కట్టించిన సత్రాలూ లే'వందిట సత్తెయ్యతో. మా పుట్టింటివాళ్ళకు సత్రాలు కట్టించే దక్షతే ఉంటే..." సత్యవతికి మళ్ళీ దుఃఖం పొర్లుకొచ్చింది.

"మరి పిన్నితో చెప్పమనలేకపోయావా సుబ్బిని?"

"ఆమె మామగారు పోయిన నాటినుండీ పూజలూ, వ్రతాలే గాని యింటి సంగతి బొత్తిగా పరికించడం లేదు. అయినా ఆమె మాట మాత్రం ఎవరికి లెక్క?"

"అయితే అంతా కలిసి సుబ్బికి యివ్వలేదన్నమాట."

"తరువాత శేషు వచ్చి చిన్నాయనతో చెప్పగా, వచ్చే నెల జీతంలో వడ్డీతో సహా తగ్గించుకొనే నిర్ణయం మీద ఇచ్చారట."

రాజేశ్వరుడు ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచి కళ్ళు మూసుకున్నాడు.

★★★ ★★★ ★★★ ★★★

"అన్నయ్యా, అమ్మ రేపు రామలింగేశ్వరాలయంలో అభిషేకం చేయిస్తుందట, దానికి రెండు వందలు ఖర్చవుతుందట; అమ్మ నీతో చెప్పమంది" అన్నది శేషు.

"చెల్లీ, అమ్మకు లోభత్వం ఎక్కువౌతున్నట్టుంది. నీ పెద్దకొడుకు బ్రతికుండగా లోభించనవసరం లేదని చెప్పు అమ్మతో. మొన్న కల్యాణానికి బ్రాహ్మలే దీవించేరటకాని అలగాజనం అసంతృప్తితోనే వెళ్ళిపోయేరట. ఈసారి ఊరంతకీ సంతర్పణ జరగాలి. ఆ యేర్పాట్లన్నీ నేను చేయిస్తాను. పూజా విధానంలో ఎంత ఖర్చయినా వెనుదీయవద్దని అమ్మతో నేను చెప్పేనని చెప్పు" అని, గుమస్తా బ్రహ్మయ్యను పిలిచి, ఐదువందలు తమ్ముణ్ణడిగి తీసుకురమ్మన్నాడు. గుమస్తా వెంటనే తిరిగివచ్చి "యిప్పుడు నిల్వసొమ్ము అంతవరకూ లేదంటున్నారండి, రెండువందలైతే..." అంటూ నీళ్ళు నమిలేడు.

"ఆ! రెండువందలా! అదెలా జరుగుతుంది?నా పేర ఖర్చు వ్రాసి ఇవ్వమను, ఫో" యిదంతా చూస్తూ కూర్చున్న శేషు తన పెద్దన్న గారి నిష్కల్మష హృదయాన్ని తలచుకొని, చాటుగా ఆనందభాష్పాలు ఒత్తుకున్నది. గుమస్తా సొమ్ము దెచ్చి రాజేశ్వరునకివ్వబోగా, శేషు కివ్వమని సంజ్ఞ జేశాడు. 'నీ హృదయం ఎంత అగాధమో నాలాంటి అల్పుల కెలా తెలుస్తుంది బాబా' అనుకున్నాడు మనస్సులో, వృద్ధగుమస్తా బ్రహ్మయ్య.

అభిషేకానికి రెండువేల రూపాయలు ఖర్చయింది. పిండివంటలతో సహా అన్ని వర్ణాలవారికీ తృప్తికరంగా సంతర్పణ జరిగింది. యింకా అభిషేకాన్ని గురించి యితర వివరాలు వ్రాయాలంటే పెద్ద గ్రంథం తయారౌతుంది. మొత్తంమీద పాటకపు జనం ఎక్కువగా అభినందించి వారి దాతృత్వాన్నీ, ధర్మశీలాన్నీ కథలుగా చెప్పుకుంటున్నారు.

భ్రాతృప్రేమతో నిండియున్న రాజేశ్వరుని హృదయం తన భార్యకు ఆయింటిలో ఏ స్థానం ఉన్నదో గ్రహించనీయలేదు. సత్యవతికి ఆ యింట్లో వీసమెత్తు పెత్తనం లేదు. గత నాలుగు సంవత్సరాలనుండీ అనేక విధాల తన భర్త హృదయం తెలిసికొన్న సత్యవతికి ప్రతి చిన్న విషయాన్ని గురించీ భర్తతో ఫిర్యాదు చేయడం వెకిలిగా కనబడ్డది. కరుణాప్రసన్నమైన తన భర్త మొఖం ఒక్కసారి చూసేటప్పటికి 'యిక నాకీ ప్రపంచంలో ఏం కావాలీ' అనుకొనేది. అందువల్లే తన తోడికోడలు తనను ఎన్ని విధాల అవమానించినా పెదవి కదల్చకుండా ఊరుకొనేది. కాని యీనాడు జరిగిన సంఘటనముందు కరుణాప్రపూరితమైన తన భర్త నేత్రాలు సజలమై కనిపించి క్రమంగా తననుంచి తప్పుకున్నాయి...

అభిషేకం నాలుగు రోజులుందనగా సత్యవతి వృద్ధతండ్రి సుబ్బారాయుడు తన కుమార్తెను చూసి పోదామని రాగా, అతనిని పార్వతమ్మా, సత్యవతీ కలిసి బలవంతం చేసి అభిషేకం చూసి వెళ్ళమన్నారు, సుబ్బారాయుడు యీ వారం రోజులలోనూ తన కుమార్తెకు ఆయింట్లో ఎంత హక్కున్నదీ గ్రహించగలిగేడు. తను భోజనానికి కూర్చున్న సమయంలో చిన్నావిడ నౌకర్లను తిట్టే తిట్లలో కొన్ని తననే అనిపించేటంత వివరంగా ఉండటం కూడా గ్రహించేడు.

మాటల సందర్భంలో ఒకనాడు సుబ్బారాయుడు యీ సంవత్సరం వరిచేనంతా పనమీద తడిసి పోయిందనీ, అందుచేత మంచిరకం కొణామణి విత్తనాలు ఎనిమిది బస్తాలు ఎక్కడైనా కొని పంపించమనీ రాజేశ్వరునితో చెప్పగా, అతను "ఎక్కడైనా కొనటమెందుకండీ? మన దగ్గరవన్నీ విత్తనాలకి పనికొచ్చేవే," అని చెప్పి, సత్తెయ్యను పిలిచి "ఎనిమిది బస్తాలు కొణామణి ధాన్యం పట్టించి, సావిట్లో పడవేయించ"మని చెప్పేడు.

సత్తెయ్య వెళ్ళి తిరిగివచ్చి "చినబాబు గారు వీల్లేదంటున్నారు." అన్నాడు. ఆ మాటకు రాజేశ్వరుడు చాలానొచ్చుకుని "వీలేమిటి ! నే చెప్పేనని చెప్పు" అన్నాడు. సత్తెయ్య మళ్ళా వెంటనే తిరిగివచ్చి "అవి ఎక్కడికి నడిపించటానికో వారికి తెలుసట. యిక్కడ ఎవరి తాలూకు యీనాములూ లేవని యిక్కడ తెలియజెప్పమన్నారు" అన్నాడు. ఈ మాటకు సుబ్బారాయుడు సిగ్గుతో క్రుంగిపోయాడు. సత్యవతి మొఖం ఎర్రనైంది. రాజేశ్వరుడు మాత్రం శాంతంగా ఒక పొడినవ్వు నవ్వి, వెంటనే గంభీరుడై "ఖరీదు యిచ్చేటప్పుడు ఎవరికైతేనేమి, వెళ్ళి పట్టిస్తూ ఉండు; నేను కూడా వస్తానక్కడికి" అని, సత్తెయ్య వెనకాలే తానూ వెళ్ళాడు. రాజేశ్వరుడు వెళ్ళగానే సత్యవతి తండ్రి ఒడిలో తల దాచుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది. సుబ్బారాయుడు కూతురి తల నిమురుతూ "అమ్మా, నువ్విక్కడ ఎంత సుఖపడుతున్నావో నాకర్థమైంది. అతనికైతే తమ్ముడుగాని నీవు మాత్రం అతని తమ్మునికి వదినెవు మాత్రం కావు. లోకంలో నేను చాలామందిని చూశాను కాని యింత విచిత్రపు సోదరులను ఎక్కడా చూళ్ళేదు. నాకూ యింత గొప్ప ఆస్తి లేకపోయినా నలుగురికీ తీసిపోను; యిక్కడీదాసి బ్రదుకు బ్రతకవలసిన అవసరం నీకు లేదు తల్లీ, ప్రయాణమై సిద్ధంగా ఉండు, బండి పిలిపించుకొస్తాను" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"వారిని రానియ్యి నాన్నా, వారితో చెప్పి వస్తాను" అన్నది సత్యవతి.

ఆ రాత్రి సత్యవతి తండ్రి దగ్గర చాలా సేపు కూర్చుని వచ్చేటప్పటికి రాజేశ్వరుడు కళ్ళు మూస్తూ తెరుస్తూ వెల్లకిలా పరున్నాడు. సత్యవతి మెల్లగా అతని పాదాలను స్పృశిస్తూ "రేపు మా నాన్నతో వెళతాను" అంది.

"ఇప్పుడేం ? ఇక్కడ కష్టంగా ఉందా?"

దీనికి సత్యవతి జవాబు చెప్పలేకపోయింది. ఎలా చెపుతుంది, తనకిక్కడ కష్టంగా ఉందని? అమృతమూర్తి తన భర్త సాదర పూర్వకంగా, అలా, ఒక్కమాట మాట్లాడితే చాలదూ? తన తోడికోడలు తనను ఎంత నీచంగా చూస్తే మాత్రమేం?

"సత్యం! యిక్కడ నీవు చాలా బాధపడుంటావు. నేను చాలా ప్రమత్తుణ్ణయ్యాను. ఏమి చేయను? వాడు నాకు తమ్ముడు" రాజేశ్వరుని కళ్ళలో నీళ్ళు తిరగడం ఆ దీపపు కాంతిలో స్పష్టంగా చూసింది సత్యవతి. తన పమిట చెరగుతో భర్తకళ్ళు ఒత్తుతూ, యిట్లాంటి భర్తను ఒంటిగా విడిచి, తను పుట్టింటికెళ్ళడం మహా పాపమనుకొని "మీరు కూడా వస్తే నాలుగు రోజులుండి తిరిగివచ్చేద్దాము" అన్నది కంపిత స్వరంతో.

"సత్యం ! నీవు వెళ్ళి, నీ యిష్టం వచ్చినన్ని రోజులుండిరా; యీలోగా, కఠినహృదయుడైన నీ యీ భర్తను మరిచిపోకుండా ఉత్తరాలు వ్రాస్తూ ఉండు" యీ మాటకు భర్త పాదాలమీద తల పెట్టి ఏడ్చింది సత్యవతి. తన భర్త కఠిన హృదయుడా ? తను ఆ మాటను ఊహించటానికే భయపడింది.

ఆ మరునాడు సత్యవతి భర్త దగ్గరకు వచ్చి అతని పాద ధూళి తీసుకొని "వెళ్ళివస్తా" నన్నది. రాజేశ్వరుని నేత్రాలు సజలమైనాయి. "పోయి సుఖంగా..." అతని కంఠము రుద్ధమైపోయింది. యిట్లాంటి భర్తను విడిచి వెళ్ళడమంటే సత్యవతికి సుతరాము యిష్టం లేకపోయినా, పుట్టిల్లు చూసి చాలా కాలమైనందువల్లా, యీలోగా తన భర్త అతని తమ్ముని నిజస్వరూపం గుర్తించ గలుగుతాడనే ఆశతోనూ ప్రయాణమైంది. భర్తకళ్ళు ఒత్తుతూ "వీలుంటే ఒక సారి అక్కడికి రాండి." అన్నది. యింతలో సుబ్బారాయుడు అక్కడికి వచ్చి అల్లునితో చెప్పి కూతుర్ని వెంటబెట్టుకుని యెద్లబండి యెక్కి వెళ్ళేడు.

ఆ మర్నాడు పార్వతమ్మ శేషును వెంటబెట్టుకొని రాజేశ్వరుని గదిలోకి రాగానే అతను చాలా కంగారుపడ్డాడు. తన తండ్రి పోయాక ఆమె యింతవరకూ తన యెదుట పడలేదు. యిప్పుడు ముందుగా కబురన్నా లేకుండా అలా రావడంతో చాలా ఆశ్చర్యపడి లేచి నిలబడ్డాడు.

"అందరూ కలిసి సత్యవతమ్మను సాగనంపేశారా నాయనా!" అన్నది పార్వతమ్మ క్రింద కంబళి మీద కూర్చుంటూ. రాజేశ్వరుడు చకితుడై "మీతో చెప్పకుండానే వెళ్ళిందా?" అన్నాడు విచలిత స్వరంతో.

"అది నాతో చెప్పకుండా వెళ్ళగలదా? మీ తమ్ముడూ, మీ తమ్ముని భార్యా దాన్ని నిలవనీకుండా తోలేసేరు. మరి నీకేమో నీ తమ్ముడే లోకం. యితర జనం ఎంత బాధపడుతున్నా నీ కనవసరం" అన్నది పార్వతమ్మ యించుక తీవ్రంగా.

"వాడు మీ చిన్నబ్బాయే కదూ, వాడికింకా చిన్నతనం వదల్లేదు. వాడివల్లేదైనా తప్పుంటే మీరు..."

"ఆ, కాకేమి ! నాకున్నదల్లా యిద్దరే సంతానం, పెద్దవాడి పేరు రాజేశ్వరుడు; రెండోది శేషును" యీమాట వినగానే ఎందువల్లో రాజేశ్వరునికి దుఃఖం పొర్లుకొచ్చింది. ఆ దుఃఖంలోనే 'అమ్మా' అంటూ ఆమె వొడిలో ఒదిగిపోయాడు.

"లే నాయనా, నీవు ఈ లోకానికి తగవు. ఒక్కొక్కప్పుడు నిన్నూహిస్తూ, నీ మంచితనాన్ని వింటూంటే నాకు భయం కూడా కలుగుతుంది" అని పార్వతమ్మ కంట తడిపెట్టింది.

"అమ్మా ! యిప్పుడేమైంది?"

"ఏమైనా అవుతుంది, నీలాంటివాడివి మూల కూర్చుని అజ్ఞానులకు అధికారమంతా వప్పజెపితే, సత్యవతిలాగే నేనూ ఎప్పుడో యీయిల్లు విడిచే రోజొస్తుంది."

"ఏమి జరిగింది శేషూ?" అని శేషువంక చూసి అడిగేడు రాజేశ్వరుడు.

"ఏమి లేదన్నయ్యా! నేను బట్టలు కావాలని చిన్నన్నయ్యను మా అమ్మ రెండువందలిమ్మందని అడిగేను. చిన్నన్నయ్య మండిపడుతూ 'యిక్కడ ఎవరి అమ్మ మొగుడి సొమ్మూ లే'దన్నాడు."

రాజేశ్వరుని మోము జేవురించిపోయింది. "అలా అన్నాడేం" అన్నాడు. యింతలో పెద్ద గుమస్తా సీతయ్య గదిలోకి వచ్చి నాలుగుమూలలూ పరకాయించి, రాజేశ్వరుని చెవిలో "చినబాబు గారు ఉమ్మడి సొమ్మెట్టి అత్తవారి ఊరిలో భూమికొన్నారు. అది వరలక్ష్మి గారి పేర పెడతారట. రేపే రిజిష్టరౌతుందట" అని ఊదేడు. రాజేశ్వరుని మొఖం మరీ కందగడ్డలా ఐపోయింది. శరీరం వణకింది. గుప్పెళ్ళు బిగుసుకున్నవి. కళ్ళల్లో అగ్ని మెరిసింది. ఆ ఉమ్మడి సొమ్ములో తన ఒక్కడిదే ఉన్నట్లయితే ఊరుకొనేవాడు. కాని దానిలో తన తండ్రి ప్రత్యేకించిపోయిన శేషు సొమ్ముకూడా ఉంది.

"వాడెక్కడున్నా, తక్షణం నేను రమ్మంటున్నానని చెప్పండి వెళ్ళి."

గుమస్తా వెళ్ళి వెంటనే తిరిగివచ్చి "యిప్పుడు ఎవరో పెద్దమనుష్యులతో మాట్లాడుతున్నారట. రావటానికి వీల్లేదన్నారు" అని చెప్పేడు.

"ఆ! అంతవరకూ వచ్చిందా ? ఎక్కడున్నాడు?"

"కచ్చేరీ సావిట్లోనండి."

పైన కండవా లేకుండానే రాజేశ్వరుడు కచ్చేరీ సావిడికి పయనమయ్యాడు. పార్వతమ్మకు ఏమీ అర్థంకాక నిశ్చేష్టురాలై అలానే కూర్చుండి పోయింది. శేషుమాత్రం "యిప్పుడు పెద్దన్నయ్య మొఖం చూస్తే భయమేసిందే అమ్మా" అన్నది.

రాజేశ్వరుడు కచ్చేరీ సావిట్లోకి వెళ్ళగానే, గౌరవ సూచకంగా అక్కడివాళ్ళందరూ లేచి నిలబడ్డారు. వారి గౌరవాల్ని గాని, అగౌరవాల్ని గాని పరామర్శించే స్థితిలో లేడిప్పుడు రాజేశ్వరుడు. తిన్నగా తమ్ముని దగ్గరకు నడిచేడు. చిన్నారావు అన్నగారి అకారం చూసి భయపడ్డాడు.

"ఏరా ! నీవు నా మరణ వార్త వినేవరకూ తృప్తి పడవనుకుంటాను !" అన్నాడు రాజేశ్వరుడు, కించిత్కర్కశంగా.

చిన్నారావు అప్రతిభుడై "నేనలా ఎవరిదగ్గరన్నాను? బహుశా పార్వతమ్మ మీకు అలా చెప్పిందేమో ; నేనన్నానని" అని అంటూండగానే రాజేశ్వరుడు తన సత్తువకొద్దీ తమ్ముని దవడమీద 'ఫేడీల్' మనిపించేడు. ఆ వూపుకి తమ్ముని చేతిలో ఉన్న తాళాల గుత్తి తూలి రాజేశ్వరుని పాదాల ముందు పడింది.

"పార్వతమ్మా? ఆమె చెబుతుందా?... వెంకటయ్య గారికి నీవు ఒక్కడివే సంతానం అయివుంటే ఎంత బావుండును!" తాళాల గుత్తి తీసుకొని వెళ్ళిపోయే రాజేశ్వరుని చూసి, అక్కడి వాళ్ళంతా వణికి పోయారు.

★★

.

COMMENTS